కొత్త పింఛన్..ఎప్పుడొచ్చున్..?

- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అయినా ఓపెన్ కాని సైట్
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తకార్డులు, పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియ
- ఇప్పుడు ఉన్న పింఛన్లనే తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం!



తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం

బంగారుపాళెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్లకు మోక్షం లభించడం లేదు. వృద్ధాప్య, వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు నిత్యం ఆయా గ్రామాల సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారులు తేల్చి చెబుతుండడంతో ఉసూరంటూ వెనుదిరుగుతున్నారు. పైగా ఉన్న పింఛన్లనే తొలగించే పనిలో నిమగ్నమైంది. రేషన్ కార్డుల పరిస్థితీ ఇలాగే ఉంది. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగిస్తే, కూటమి పాలనలో దీనికి భిన్నంగా ఉంటోంది.

ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్

2024 ఏప్రిల్ 18 నుంచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ఆగిన సైట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఇంకా ఓపెన్ చేయకపోవడంపై ప్రజలు సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల కోసం 60 ఏళ్లు నిండిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులతో పాటు కొత్తగా వివాహాలు చేసుకున్న వారు రేషన్ కార్డుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు వరకు మండలంలో అన్ని రకాల పింఛన్ల లబ్ధిదారులు 13 వేల మంది ఉన్నారు.

50 ఏళ్లకే పింఛన్ ఏదీ?

కూటమి ప్రభుత్వం అధికారంలోని వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోని వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఆ హామీ మాటే ఎత్తడం లేదు.

గతం ఘనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో వారు ఇంటి వద్దకు వచ్చి అర్హులను గుర్తించి వారే దరఖాస్తు చేసి పింఛన్లు, రేషన్ కార్డులు ఇచ్చే సౌకర్యం అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం ఇవ్వకపోవడంతో నియోజకవర్గంలోని అర్హులైన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎప్పుడిస్తారో..ఏమో?



నాకు 60 ఏళ్లు నిండాయి. పింఛను కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాని వెళితే ఇంకా కొత్త పింఛన్ల కోసం సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్లకు సంబందించి సమాచారం రాలేదని చెబుతున్నారు. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో ఏమో!?

-రవి మొగిలి వెంకటగిరి

పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియగా ఉండాలి



పేదలకు ఇచ్చే పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం ఇంత వరకు సైట్ ఓపెన్ చేయకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలో కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకోవాలి. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి.

-శిరీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ

ఆదేశాలు రావాల్సి ఉంది



కొత్తరేషన్ కార్డులు, పింఛన్ల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. స్పౌజ్ పింఛన్లకు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇతర పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం.

-మహేష్, ఎంపీడీఓ, బంగారుపాళెం

క్లుప్తంగా

టిడ్కో గృహాలు మంజూరు చేయరూ!


మాట్లాడుతున్న విజయగౌరి

చిత్తూరు కార్పొరేషన్: లబ్ధిదారులకు టిడ్కో గృహాలను మంజూరు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి విజయగౌరి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అర్హత గల లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు సేకరించి గృహాలను ఇవ్వకపోవడమేమిటని ప్రశ్నించారు. దీనిపై నగర, జిల్లా సర్వసభ్య సమావేశాల్లో చర్చించి ఆందోళనకు చేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకులు జమిలాబి, మణి, గోపినాథ్, కుమారి, కోమల, దేవయాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్–ఉన్–నబీ


అన్నదానం చేస్తున్న ముస్లింలు

ఐరాల: మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం ఐరాలలో ముస్లింలు మిలాద్–ఉన్–నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జామియా మసీదులో మూడు రోజులుగా ముస్లింలు బయన్ కార్యక్రమం నిర్వహించారు. ముతవల్లి హైదర్‌బాషా, మత గురువు జబ్బార్ ధార్మికోసన్యాసం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ అల్లా ప్రభోదించిన విషయాలను, సందేశాలను ఆచరణలో పాటించాలన్నారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేసి, నూరనీ షాదీ మహల్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ముస్లిం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శక్తి నాగాలమ్మ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న వేద పండితులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టు ఇందిరమ్మ కాలనీలోని శ్రీశక్తి నాగాలమ్మ ఆలయంలో శుక్రవారం వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వరపూజ, నగవగ్రహపూజ, కలశాభిషేకాలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యాదమరి: మండలంలోని జోడిచింతలలో శుచి స్వచ్ఛంద సంస్థ శుక్రవారం చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ ఆసుపత్రి సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. దాదాపు 40మందికి వైద్య పరీక్షలు చేసి 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి చెన్నైలో ఆపరేషన్లు చేయించి తిరిగి స్వస్థలాలకు చేరుస్తామని సంస్థ అధినేతలు పాల్ విజయ్‌కుమార్, గ్లోరీ తెలిపారు. శంకర నేత్రాలయ వైద్య బృందం, సంస్థ సిబ్బంది వరదరాజ్, చిన్నయ్య, జాన్సన్, జాకబ్, యోవాన్ తదితరులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

7న అర్ధగిరి ఆలయం మూసివేత

తవణంపల్లె: ఈ నెల 7వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఈఓ హనుమంతరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 నుంచి సోమవారం తెల్లవారుజాము 3 గంటల వరకు ఎలాంటి పూజా కార్యక్రమాలు నిర్వహించమని, సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయాన్ని తెరిచి, శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత ఉదయం 5 నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తామన్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత ప్రసాదాల వితరణ నిలుపుదల చేసినట్లు చెప్పారు.

నేడు నాలుగు గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

తవణంపల్లె: మండలంలోని ఎగువ తవణంపల్లె, ఎగువమత్యం, టి.పుత్తూరు, పైమాఘం గ్రామాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కట్టమంచిలో కొలువుదీరిన వినాయకుడు


విజయానందరెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని కట్టమంచిలో శుక్రవారం వినాయకుని కొలువుదీర్చారు మండపంలో స్వామికి పూజలు చేసి హారతులిచ్చారు. ఈ పూజా కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చుడా మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు ఏపీ శ్రీధర్, కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు శివారెడ్డి, మనోహర్ రెడ్డి, బాబు, బుజ్జి, సోమిరెడ్డి, మనోజ్రెడ్డి, శేఖర్రెడ్డి, సిద్ధ, రెడ్డిసాయి తదితరులు పాల్గొన్నారు

లక్ష్యసాధనతో తల్లిదండ్రుల ఆకాంక్షల్ని నెరవేర్చండి


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు ఉన్నతాశయంతో విద్యనభ్యసించాలని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆర్‌కే డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఎస్పీ మాట్లాడారు. ద్యార్థులు సామాజిక మాధ్యమాలకు బానిసలు కారాదని హితవు పలికారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో దానిని సాధించి, తల్లిదండ్రుల ఆకాంక్షల్ని నెరవేర్చాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ మాట్లాడుతూ, తమ కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. ప్రిన్సిపల్ రమేష్‌బాబు మాట్లాడారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

టీచర్లకు సన్మానం


ఉపాధ్యాయులకు సన్మానం

యాదమరి: స్థానిక జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కనకాచారి ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయులు భాస్కరరావు, త్రివేణి, వెంకటేష్‌తోపాటు పదిమంది సీనియర్ టీచర్లను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్, హెచ్‌ఎం గిరిరాజ, ఆనంద పిళ్లై, షహనాజ్, అఖిలభాను, రమేష్, విశ్వనాథ్, హరికృష్ణ, తులసిప్రసాద్, హేమకుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

అభినందన


రిజిస్ట్రార్ రూపేష్‌బాబును అభినందిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి

చిత్తూరు కలెక్టరేట్ : జీవ టెక్నిలాజికల్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమితులైన చిత్తూరు వాసి డాక్టర్ రూపేష్‌బాబును వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి శుక్రవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆయన 25 ఏళ్లుగా పలు రకాల వృత్తి విద్య శిక్షణా తరగతులు నిర్వహించి, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని, ఆయన ప్రతిభా పాటవాలను మరింతగా వినియోగించుకునేందుకు ప్రస్తుతం చెన్నైలోని జీవ టెక్నిలాజికల్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా నియమించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బాబు, రిటైర్డ్ హెచ్‌ఎం జీవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం


ఆలయ కుంభాభిషేకంలో గ్రామస్తులు

యాదమరి: చెన్నారెడ్డిపల్లెలోని నూతన శ్రీ రాధారుక్మిణి సమేత శ్రీకృష్ణ ఆలయ కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు స్వామి వారి చిత్రపటానికి ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం భక్తజన సందడి నడుమ పరిణయోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి యాదమరి మండల జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు ఆదిమూలం, చిన్నమునిరెడ్డి ఆధ్వర్యంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతికం

పౌరాణిక నాటక ప్రదర్శనలో ఒక సన్నివేశం






నృత్యం చేస్తున్న కళాకారిణులు

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం దేవస్థాన ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో మంత్రముగ్ధుల్ని చేశారు. అలాగే పౌరాణిక నాటకాల ప్రదర్శనతో మెప్పించారు. కళాకారులను ఈఓ పెంచల కిషోర్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. - కాణిపాకం



ప్రశంసా పత్రాలు అందుకున్న కళాకారులతో ఈఓ తదితరులు

గజ బాధితులకు నష్ట పరిహార చెక్కులు పంపిణీ

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో ఏనుగుల దాడుల్లో పంట నష్టం, ప్రాణ నష్టం బాధిత రైతులకు రూ.12.77లక్షల పరిహారం చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. పంటలు నష్టపోయిన 78 మందికి రూ.7.02లక్షలు, పాడిఆవు మృతి చెందిన రైతుకు రూ.75వేలు, ప్రాణనష్టం కలిగిన కుటుంబీకులకు రూ.5లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఏనుగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, త్వరలో కొత్త టెక్నాలజీ సాయంతో ఏనుగులకు చిప్‌లు అమర్చి కుంకీలతో అడవిలోని ఏనుగులను కట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి వేణుగోపాల్, ఎఫ్ఆర్వో నారాయణ, అటవీశాఖ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

పుంగనూరు: పట్టణంలో మినీ బైపాస్ రోడ్డులోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కమలాకర్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ టీచర్లకు అవార్డులు

చిత్తూరు కలెక్టరేట్ : అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. శుక్రవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ప్రజాప్రతినిధులు ఈ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.


హసన్‌బాషా, గ్రేడ్–2 హెచ్‌ఎం, చిత్తూరు | గోపినాథరెడ్డి, హెచ్‌ఎం, ఐరాల | మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం, తవణంపల్లె | పాపయ్య, చిత్తూరు | ధనలక్ష్మి, తవణంపల్లె | మదన్న, ఎస్‌ఏ, తవణంపల్లె | మీనాక్షి, ఎస్‌ఏ, యాదమరి | సుబ్రహ్మణ్యం, ఎస్‌ఏ, పూతలపట్టు | కార్తీక్, ఎస్‌ఏ, చిత్తూరు | పట్టాభి ఆచారి, ఎస్‌ఏ, చిత్తూరు | చౌదరినాయుడు, ఎస్‌ఏ, పూతలపట్టు | శేషగిరిరావ్, ఎస్‌ఏ, బంగారుపాళ్యం


దేవరాజ్, పీఎస్‌హెచ్‌ఎం, బంగారుపాళ్యం | రమణారెడ్డి, బంగారుపాళ్యం | రెహానాబేగం యాదమరి | అమృతవల్లి, చిత్తూరు రూరల్ | రాధాకుమారి, చిత్తూరు రూరల్ | లీలావతి, ఐరాల | చంద్రశేఖరపిళ్లయ్య, గుడిపాల | బుజ్జమ్మ, తవణంపల్లె | కవిత, ఎస్‌జీటీ, పూతలపట్టు | లక్ష్మికుమారి, చిత్తూరు రూరల్ | వాసవి, చిత్తూరు | గాయత్రి, చిత్తూరు | ధనకాంతశాస్త్రి, పూతలపట్టు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు - పూతలపట్టు :
95539 55610